క్లుప్తంగా

కుంతీదేవి ఆలయానికి భూమిపూజ



కుంతీదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: టేకి దళితవాడలో రూ.10 లక్షలతో కుంతీదేవి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం భూమిపూజ చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కుక్కల నాగమణి, మండల సాగు సలహా మండలి సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలం గోవింద్, గ్రామ అధ్యక్షుడు కుక్కల బాలయ్య పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు గ్రామ దళిత నాయకులు కొల్లి జయరాజు, దాసి రాంజీ అంబేద్కర్, మాసాబత్తుల వెంకట్రావు, దాకి బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉమ్మిడిశెట్టి సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

రాయవరం: లొల్లలో వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా శాశ్వత పందిరి నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం భూమిపూజ చేశారు. 145 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో రూ.23 లక్షల అంచనాతో ఈ పనులను చేపడుతున్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ ద్వారా రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా హిందూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, దేవాలయ కమిటీ చైర్మన్ గుండపునీడి వీర్రాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్వామిత్ర సర్వే

కపిలేశ్వరపురం: వాకతిప్పలో శనివారం స్వామిత్ర సర్వే చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తి, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని నివాసిత ప్రాంతాలను సర్వే చేస్తున్నట్లు శివచక్రవర్తి తెలిపారు. సర్వే పరికరాల సాయంతో రోవర్ పాయింట్లను నిర్ధారించారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తామన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

రాయవరం: బీసీ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. మండల బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా పంపన రామారావు, అధ్యక్షునిగా లచ్చిరెడ్డి వెంకటరమణ, ఉపాధ్యక్షునిగా వాసంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దొంతంశెట్టి సతీష్, ట్రెజరర్‌గా కిలపర్తి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా కసిరెడ్డి అజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం హాజరయ్యారు.

గొల్లపాలెంలో అన్నసమారాధన

కాజులూరు: గొల్లపాలెం కొత్తపేటలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. ఇక్కడి కాకినాడ- కోటిపల్లి రహదారిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని దాతల సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. సుమారు రెండు వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ర్యాలి కృష్ణ, బోనం రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

బంద్ విజయవంతానికి పిలుపు

రామచంద్రపురం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కర్మాగారం కార్మికులు చేస్తున్న పోరాటం ఈ నెల 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతుంది. వారికి మద్దతుగా పీడీఎస్‌యూ తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ శనివారం కోరారు. పట్టణంలో సిద్ధూ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

విద్యుత్ కాంతులొస్తున్నాయ్..



స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న పాపారాయుడు

మండపేట: అర్తమూరు ప్రజల కోరిక త్రీఫేజ్ విద్యుత్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ లైన్లు వేసేందుకు మండపేట- రామచంద్రపురం కెనాల్ రోడ్డు సమీపం నుంచి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్తమూరుకు త్రీఫేజ్ విద్యుత్ లైన్ ఇవ్వాలని గత టీడీపీ ప్రభుత్వంలో అనేకమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి ఎంపీ మిధున్ రెడ్డి, ఉన్నతాధికారులతో మాట్లాడి త్రీఫేజ్ మంజూరుకు కృషి చేశారన్నారు. రూ. 20 లక్షలతో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నాయకులు కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్, వనుం నారాయణ పాల్గొన్నారు.

చివరిలో అలజడి

- మొదలైన ఖరీఫ్ కోతలు
- ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



వరి పైరుపై కమ్ముకున్న మబ్బులు



మండపేటలో యంత్రంతో కోతలు

మండపేట: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వాతావరణంలోని మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు పడుతుండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 98,500 ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేశారు. అధిక విస్తీర్ణంలో వరి పంట తుది దశకు చేరుకోగా కోతలు మొదలయ్యాయి. సాగులో తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా పండింది. ముందుగా నాట్లు వేసిన మండపేట నియోజకవర్గంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం ప్రాంతాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల రైతులు కోతలకు సన్నద్ధమవుతున్నారు. డివిజన్ పరిధిలో మరో వారం పది రోజుల్లో తొలకరి తుది దశ పనులు జోరందుకోనున్నాయి. ఈ తరుణంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రైతులను కలవరపరుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం మబ్బులు కమ్ముకుని మండపేట, రాయవరం, రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ఆకాశం మేఘావృతమై ఉండటంతో కోతలు కోసేందుకు సిద్ధమైన రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురైంది. కోత దశలో వర్షాలు పడితే వరిపైరు నేలకొరిగి పంట దెబ్బతినడంతో పాటు పెట్టుబడులు పెరిగి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో రెండు మూడు రోజుల పాటు వేచిచూసి వాతావరణం బట్టి ముందుకు సాగాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులకు సహాయకారిగా 'పొలంబడి'



రైతుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి, సర్పంచ్ ఆరిఫ్ తదితరులు

రాయవరం: తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించడానికి పొలంబడి ఎంతో ఉపకరిస్తుందని జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి తెలిపారు. శనివారం సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ అధ్యక్షతన పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ పొలంబడిని రైతులు వినియోగించుకుని, పూర్తి అవగాహన ఏర్పరచుకున్న విధానం బాగుందన్నారు. పొలంబడి శిక్షణతో రైతులు ఆరోగ్యకరమైన పంటలను పండిస్తున్నారన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ రాజశేఖర్ మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. తక్కువ మోతాదులో ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చును ఆదా చేసుకోవడమే కాకుండా పురుగులు, తెగుళ్లు కూడా పంటను తక్కువగా ఆశిస్తాయన్నారు. ఫలితంగా రసాయనిక పురుగు మందులను పిచికారీ చేయడం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఆలమూరు ఏడీఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ మిత్ర పురుగులను గుర్తించడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో 14 వారాల పాటు 30 మంది రైతులకు పొలంబడిలో పలు అంశాలు వివరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం పొలంబడి సౌలభ్య రైతుకు, బ్యాలెట్ బాక్స్‌లో అధిక మార్కులు వచ్చిన రైతులకు సర్పంచ్ ఆరిఫ్, అధికారుల చేతుల మీదుగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాకా శ్రీను, సభ్యుడు గరగ కామరాజు, వార్డు సభ్యుడు ఫణిశంకర్, మండలంలోని వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం



స్థానికులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- సీఎం జగన్ పాలనతో అది సాధ్యం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక మెరకవీధి ప్రాంతంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ తదితరులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం ద్వారా నాలుగున్నరేళ్లలో అర్హులకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. వారు చెప్పిన సమస్యలను అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ సుబ్బారావులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. తొలుత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు దంపతులు, మాజీ సర్పంచ్ దూలం ఆనందరావు నివాసం వద్ద ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం లభించింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పలుకూరి వెంకన్నబాబు, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు కొల్లి సుబ్రహ్మణ్యం, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గణేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు విన్నకోటి ప్రసాద్, రజక సంఘం అధ్యక్షుడు నరమామిడి రాజు, ఎస్టీ సంఘం అధ్యక్షుడు సమతం పాపారావు, దళిత సంఘాల నాయకులు చంద్రమళ్ల లాజరు, యడ్ల రవి, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోటను సత్కరించారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చెకుముకి పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: వచ్చే ఏడాది జనవరి 27, 28వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్లను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. విద్యార్థులకు సైన్స్ పట్ల అభిలాషను పెంచి శాస్త్రీయతతో కూడిన ఆలోచనలను పెంచే విధంగా ఏటా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం విలేకరులకు వివరించారు. ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో పాల్గొనేందుకు అన్ని యాజమాన్య పాఠశాలల 8, 9, 10 విద్యార్థులు అర్హులన్నారు. ఇతర వివరాలకు తమ పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి, చెకుముకి మండల కన్వీనర్ రెడ్డి కనక రాజశేఖర్, పాఠశాల కన్వీనర్ చల్లా భవానీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు పసుపులేటి మెహర్ సుజాత, గుణ్ణం సత్తిబాబు, చేబ్రోలు ఉమాపతి శాస్త్రి, కోడి ప్రసాద్, పి.రాంబాబు, డీఎస్‌ఎల్ దేవి, బొడ్డు సూరిబాబు పాల్గొన్నారు.

కె.గంగవరం: చెకుముకి సైన్స్ సంబరాలకు విద్యార్థులు సిద్ధం కావాలని ఎంపీపీ నాగమణి, జిల్లా కన్వీనర్ పీవీ బ్రహ్మానందం పిలుపునిచ్చారు. కె.గంగవరం ఎమ్మార్సీలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. మండల కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగరాజు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు నడుం బిగించాలి

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచే అవినీతి నిర్మూలనకు నడుంబిగించాలని ఎంఈఓ నాగరాజు సూచించారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో శనివారం స్థానిక యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవినీతిపై పోరాటం అనే అంశంపై పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని ప్రోత్సహించరాదని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బ్యాంక్ మేనేజర్ కె.వెంకటదివ్య, ఎంఈఓ-2 అంజనేయులు బహుమతులు అందించారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని ఈ నెల 6న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

బీమా సొమ్ము అందజేత

కపిలేశ్వరపురం: కేదారిలంకలో ఈ నెల 1న కొబ్బరి చెట్టు మీదపడి గ్రామానికి చెందిన రైతు యర్రంశెట్టి కృష్ణ (50) మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ములో మొదటి విడతగా శనివారం రూ.పది వేలను ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్యనారాయణ అందజేశారు. సచివాలయ కన్వీనర్ యర్రంశెట్టి నాగేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ దివాకర్, కార్యదర్శి నరసింహారావు, సిబ్బంది గంటా రామకృష్ణ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన రేగిళ్ల సత్యగోపాలకృష్ణ భీమేశ్వర వీరభద్రరావు (39) ఈ నెల 2న మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మంజూరైన రూ.లక్షలో మట్టి ఖర్చుల నిమిత్తం శనివారం రూ. 10 వేలను మృతుని భార్య వెంకటసాయిదుర్గా నాగలక్ష్మి, ఇద్దరు కుమారులకు సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి అందజేశారు. మిగిలిన సొమ్ము రూ.90 వేలు భార్య పేరుపై బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యురాలు కొర్ల శ్రీవాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ గంజా లోవప్రసాద్, వలంటీర్ సీహెచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలో యూఐపీ కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది కపిలేశ్వరపురం, అంగర తదితర గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి టీకాలు వేశారు. ఎంఎల్‌హెచ్‌పీ దేవి, వైద్యఆరోగ్య కార్యకర్తలు చెల్లుబోయిన దేవి, ఝాన్సీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛత... అందరి బాధ్యత



స్వచ్ఛత మన బాధ్యతలో భాగంగా తర్లంపూడిలో మొక్క నాటుతున్న ఏసురాజు

కాజులూరు: పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. శనివారం తర్లంపూడిలో సర్పంచ్ నరాల బాలరాజు ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు 'స్వచ్ఛత.. మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గం స్వచ్ఛత దిశగా పయనిస్తుందన్నారు. ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉపాధి కూలీలు గ్రామంలో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. పలుచోట్ల నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. నాయకులు పెంకే వెంకటరమణ, కాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: గ్రామాల్లో పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. దంగేరు సచివాలయం-2, పాణింగపల్లి, కూళ్ల, సుందరపల్లి గ్రామాల్లో స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు పారిశుధ్య కార్మికులతో కలసి ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పారిశుధ్య కార్మికుల శ్రమను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. సర్పంచులు చీకట్ల సునీతగోపాలం, చిల్లే నాగేశ్వరరావు, కొప్పిశెట్టి రమణ, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సొసైటీ చైర్మన్ అచ్యుతరామయ్య, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలనకు బ్రహ్మరథం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు

మండపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కేశవరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి వివిధ పార్టీలకు చెందిన ముద్రగడ వెంకటస్వామి, చిరుకూరి వెంకటేశులు, పేకేటి నాగేశ్వరరావు, వరదా శ్రీనివాసు, పిడక లోవరాజు, నరేంద్రవరపు త్రిమూర్తులు తదితర 100 మందికి పైగా స్థానికులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్సీ తోట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి జగన్‌ను తిరిగి సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్ పాలన, ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పార్టీలో చేరిన కుప్పాల శ్రీనివాసు, మాసరరాజు, గండిమేనుశివ, గాజుల వీరబాబు, అప్పన్న ఉన్నారు.

ఆధ్యాత్మికతతో సన్మార్గం



ఆర్యావటంలో సత్యసాయిబాబా ప్రేమరథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కాజులూరు: ఆధ్యాత్మికతతోనే సన్మార్గంలో పయనించవచ్చని గొల్లపాలెం శ్రీసత్యసాయి సేవా మండలి అధ్యక్షుడు గంటా ధనరాజు అన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తి విశ్వాసాన్ని, ప్రేమ, సేవా భావాలను వికసింపజేసేందుకు రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి ఆరు నెలలుగా సాగుతున్న సత్యసాయిబాబా ప్రేమ రథం శనివారం గొల్లపాలెం చేరుకుంది. గంటా ధనరాజు ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యసాయి సేవా మండలి సభ్యులు రథానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ వీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా ధనరాజు మాట్లాడుతూ గొల్లపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరితో కాకినాడ జిల్లాలో బాబావారి రథయాత్ర ముగిసి కోనసీమ జిల్లాలో ప్రారంభమవుతుందన్నారు. ఆపై రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో కొనసాగి పుట్టపర్తి చేరుతుందన్నారు. సత్యసాయి సేవా మండలి సభ్యులు పెంకే సత్తిబాబు, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన అంగన్‌వాడీల జిల్లా మహాసభలు



జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు వీరే

మండపేట: సీఐటీయూ ఆధ్వర్యంలో మండపేటలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రెండు రోజుల జిల్లా మహాసభలు శనివారంతో ముగిశాయి. స్థానిక బాబు అండ్ బాబు కన్వెన్షన్‌లో జరిగిన ప్రతినిధుల సమావేశంలో 33 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బండి వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణవేణి, కోశాధికారిగా పరమట అమూల్య ఎన్నికయ్యారు. సంఘ నాయకురాలు కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ తదితరులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం పనిచేయాలన్నారు. సంఘ నాయకులు నూకల బలరాం, రాణి, వెంకటదుర్గ, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 31 మంది ప్రతిభ



ఎంపికైన వారితో జీవీ రావు, వికాస ప్రతినిధులు

రామచంద్రపురం: స్థానిక మోడరన్ కళాశాలలో శనివారం వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. దీనికి 83 మంది హాజరుకాగా 31 మంది టెక్ మహీంద్ర, కోజెంట్, డెక్కన్, సోలారా, డిక్సన్, ఇసుజు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని వికాస ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు టి.శ్రీవేణు, వి.రాజారమేష్ తెలిపారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

- ఆర్డీఓ సుధాసాగర్



రామచంద్రపురంలో ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్



వాకతిప్పలో సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సూర్యారావు

రామచంద్రపురం రూరల్/రామచంద్రపురం: అర్హులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రామచంద్రపురం నియోజకవర్గ వ్యాప్తంగా శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు 600 మంది దరఖాస్తులు అందించారని తెలిపారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యాసంస్థల ప్రాంగణంలో, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను ఆయన సందర్శించారు. మొదటి రోజు ఫారం-6లు 380, ఫారం-7లు 100, ఫారం-8లు 120 రామచంద్రపురం అర్బన్, రూరల్, కాజులూరు, కె.గంగవరం మండలాల పరిధిలోని 239 పోలింగ్ కేంద్రాల్లో అందించారని తెలిపారు.

రాయవరం: చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపైన్‌లో భాగంగా ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపైన్‌లో కొత్తగా ఓటు హక్కు కోసం 146 దరఖాస్తులు స్వీకరించగా, ఫారం-7లు 27, ఫారం-8లు 52 దరఖాస్తులు వచ్చాయి.

ఓటు నమోదు శిబిరాల సందర్శన

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శనివారం ఏర్పాటైన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు సందర్శించారు. వాకతిప్ప, కోరుమిల్లి, మాచర తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆదివారం సైతం శిబిరాల్లో ఓటు నమోదు దరఖాస్తులను స్వీకరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

వలంటీర్ కుటుంబానికి సాయం



జనార్దన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

కె.గంగవరం: దంగేరు గ్రామ సచివాలయ వలంటీర్ పంపన జనార్దన్ ఇటీవల మృతి చెందాడు. జనార్దన్ కుటుంబాన్ని ఆదుకోవడానికి సచివాలయ సిబ్బంది, తోటి వలంటీర్లు, ప్రజాప్రతినిధులు కొంత సొమ్ము సేకరించారు. ఈ సొమ్మును శనివారం మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మేలును వివరిద్దాం



మాట్లాడుతున్న రఘురాం

రామచంద్రపురం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలును ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో శనివారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పార్టీ నిర్దేశించిన విధంగా మండలంలోని ఒక్కో గ్రామం ఎంపిక చేసుకుని ఆయా గృహాలను సందర్శించాలని అన్నారు. పథకాలతో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేస్తూ జగనన్న చేస్తున్న సంక్షేమ పాలనను వివరించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాల వద్ద సమావేశం నిర్వహించి గ్రామం మొత్తంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఎంపీపీ అంబటి భవాని, పార్టీ మండలాధ్యక్షుడు పలివెల నాగరాజు, నాయకులు టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.